నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల ప్రక్రియలో భాగంగా శనివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ
- సురక్ష ఫీడర్ పరిధిలో.. సురక్ష కాలనీ, రాజేందర్ రెడ్డి కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. శంకర్‌నగర్, భవానీపురం, వేమన కాలనీ
- ఓల్డ్ బొంబాయి ఫీడర్ పరిధిలో.. ఓల్డ్ బొంబాయి రోడ్డు, గౌతమినగర్
- ఎస్టీపీ ప్లాంట్, భిక్షపతి ఫీడర్ పరిధిలో.. భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ
- శంకర్ నగర్ ఫీడర్ పరిధిలో.. ఓల్డ్ బొంబాయి రోడ్డు, జవహర్ కాలనీ, గౌతమీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

హెచ్‌యంటి హిల్స్ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: హెచ్‌యంటి హిల్స్ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగింపునకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు వెస్టర్న్‌హిల్స్, విజేత సూపర్‌మార్కెట్ వెనుక వైపు, అడ్డగుట్ట రోడ్డు నెంబర్ 5 నుంచి 10, ఐసిఐసిఐ బ్యాంక్ వెనుక వైపు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : బీకే ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. శనివారం ఉదయం 10.30 గంటల నుండి మ. 12.30 గంటల వరకు జేపీఎన్‌నగర్ మెయిన్‌రోడ్డు, జనప్రియ వెస్ట్ సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, హెచ్‌ఎంటీ మక్తా కాలనీలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్‌పార్క్ ఏరియా, గచ్చిబౌలి వీధి నంబర్ 1,2,3, సంధ్య కన్వెన్షన్, కేంద్రీయవిహార్, టీఎల్‌ఎఫ్ గేట్ నెంబర్ 1,2,3, గచ్చిబౌలి ఫ్లై ఓవర్ ఏరియా, బ్రహ్మకుమారీస్, ఎస్‌ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, ఐడీబీఐ క్వార్టర్స్, గచ్చిబౌలి స్టేడియం, హిల్‌రిడ్జ్ విల్లాస్, అపార్ట్‌మెంట్స్, ఎమ్మార్ ప్రాపర్టీస్, గమన్ హాస్పిటల్, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఇందిరానగర్, టిమ్స్ హాస్పిటల్, పుల్లెల గోపీచంద్ అకాడమీ, గ్రీన్ ల్యాండ్ కాలనీ, జయభేరీ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొండాపూర్‌లో..

మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓయు కాలనీ, గోల్డెన్ తులీప్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజప్రసాదం, కళాజ్యోతి బిల్డింగ్, ఎస్‌వీసీ అపార్ట్‌మెంట్ లేన్, మసీద్‌బండ కమ్యూనిటీ హాల్ పరిసరాలు, కల్లు కాంపౌండ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి


స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: నానక్‌రాంగూడలో సర్వే నంబర్ 149లో క్రమబద్ధీకరించిన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ 59 జీఓ నిబంధనల ప్రకారం కబ్జాలో ఉన్నట్టు, నిర్మాణాలు లేకున్నా, ఎలాంటి ఆధారాలు లేకున్నా ఇష్టానుసారంగా క్రమబద్ధీకరించారని తెలిపారు. క్రమబద్ధీకరించిన కొద్ది గంటల్లోనే వివిధనిర్మాణ సంస్థలకు రిజిస్ట్రేషన్ చేశారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న 7 ఎకరాల స్థలాన్ని చదరపు గజాలుగా విభజించి రెగ్యులరైజ్ చేశారన్నారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించిన అధికారులు, లబ్ధిపొందిన వారిని, నిర్మాణ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ దీనిపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు హన్మంత్ నాయక్, శివసింగ్, శేఖర్, రమేష్ తదితరులున్నారు.

వేమన పద్యాల గొప్పదనాన్ని పిల్లలకు తెలియజెప్పాలి


విజేతలతో హెచ్‌ఎం మురళి, ఉపాధ్యాయులు

రాయదుర్గం: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను పెంపొందించుకోవాలని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. మురళి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో తెలుగు విభాగం, వేమన ఫౌండేషన్ అనంతపురం ఆధ్వర్యంలో అప్పిరెడ్డి హరినాథరెడ్డి పర్యవేక్షణలో వేమన పద్యపఠన పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేమన పద్యాలలోని గొప్పదనాన్ని తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. 160 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొనగా వారికి ప్రశంసా పత్రాలు, పతకాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ ఎల్ పార్థసారథి, టి అశోక్, ఎస్ దీప్తి, ఉపాధ్యాయ బృందం, అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్ : ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి గోరుమిల్లకుంట తండాకు చెందిన కేతావత్ హన్మంత్(52), భార్య పాట్నీ, చిన్న కూతురుతో కలిసి మియాపూర్‌లోని నడిగడ్డ తండాలో కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భార్య పాట్నీ కూలీ డబ్బులు తీసుకురావడానికి కూతురుతో కలిసి బయటకి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి భర్త హన్మంత్ చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో హన్మంత్‌ను దింపగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం


సరిత

మియాపూర్ : పనికి వెళ్తున్నానంటూ వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. మియాపూర్ ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా తేజావత్ తండాకు చెందిన బోడ సరిత(22) మియాపూర్ నడిగడ్డతండాలోని ఆమె చిన్నమ్మ ఇంట్లో ఉంటూ ఎస్‌ఎంఆర్ విజేతలో పనిచేస్తుంది. ఈ నెల 11వ తేదీన 12.15 గంటలకు పనికి వెళ్లింది. రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చిన్నాన్న నరేష్ చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. తప్పిపోయిన రెండు రోజుల వరకు కుటుంబ సభ్యులతో మాట్లాడింది. తర్వాత ఫోన్ కలవకపోవడంతో ఆందోళన చెందిన చిన్నాన్న నరేష్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌సీయూలో ఉచిత వైద్యశిబిరం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌లో అబాట్ ఫార్మాస్యూటికల్స్ హైదరాబాద్ సహకారంతో థైరాయిడ్ స్క్రీనింగ్ క్యాంపును ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్-2047 కార్యక్రమంలో భాగంగా ఈ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ, ,అబాట్ ఫార్మాస్యూటికల్స్ ప్రతినిధి ఆదిత్య ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, ఆరోగ్య కేంద్రం సీఎంఓ కెప్టెన్ రవీంద్రకుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 165 మంది నుంచి రక్త నమూనాలను పాథాలజిస్టుల ద్వారా సేకరించారు. కార్యక్రమంలో పలువురు ఎన్‌ఎస్‌ఎస్ హెచ్‌సీయూ వలంటీర్లు, హెల్త్ సెంటర్ వైద్య బృందం పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు.. కేబుల్ వైర్లు

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- అధికారులు స్పందించాలని స్థానికుల వినతి


అయ్యప్పసొసైటీలో అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లు

మాదాపూర్: విద్యుత్ స్తంభాలపై కరెంట్ వైర్లు, కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఐటీ ప్రాంతం అయిన మాదాపూర్ పరిసర ప్రాంతాలైన చందానాయక్‌తండా, సాయినగర్, అయ్యప్పసొసైటీ తదితర ప్రాంతాలలో కేబుల్‌వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కరెంటు స్తంభాల పక్కనే మరో స్తంభాన్ని ఏర్పాటు చేసి కేబుల్ వైర్లను కట్టి వదిలేస్తున్నారు. దీనివల్ల ఒక్కోసారి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కరెంట్ హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు బాగు చేయడానికి ఎవ్వరు రావడం లేదని తెలిపారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక వర్షాకాలం తరుచు కరెంట్ పోవడం, షార్ట్‌సర్క్యూట్ వల్ల టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవుతున్నాయని, కేబుల్ వైర్లు రోడ్డుపై కిందికి వేలాడే విధంగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. ఇకనైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


మాదాపూర్ చందానాయక్ తండాలో ..

దరఖాస్తుల ఆహ్వానం

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్‌లోని జూబ్లీహిల్స్ మైనార్టీ బాలికల కళాశాలలో 2024-25 సంవత్సరానికి ప్రవేశాలకు గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ నాగ స్వర్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో (సీఈసీ, ఎంఈసీ) ముస్లిం మైనార్టీ (30 సీట్లు), నాన్ మైనార్టీ విద్యార్థులకు (10 సీట్లు)లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 6,7,8 తరగతులకు ముస్లిం మైనార్టీ విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఉచిత విద్య, భోజనం, యూనిఫాం, పుస్తకాలు ఇస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9703296221, 7995057898 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

22 నుంచి నిత్య హోమం

రాయదుర్గం: ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్‌ధామ్ ఆశ్రమం ఆలయంలో ఈనెల 22వతేదీన నిత్య అగ్నిహోమంను ప్రారంభిస్తామని ఆలయ నిర్మాణకర్త, చైర్మన్ ఎల్ మక్కన్‌సింగ్ తెలిపారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కుట్టుమిషన్లు పంపిణీ



గచ్చిబౌలి: పేదలకు చేయూత అందించేందుకు పెగా సిస్టమ్స్ సంస్థ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గచ్చిబౌలిలోని నిర్మాణ్ స్కిల్ సెంటర్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈడీపీ) కార్యక్రమంలో భాగంగా పేదలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. పెంగా లీడ్ కాన్సుల్ ఇండియా ఇంటర్నేషనల్ కమర్షియల్ లా ప్రతినిధి ధరణికొట సుయోధన్, ఉపాధ్యక్షుడు గౌతమ్ పర్చా, నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకులు మయూర్‌పట్నాల, సీఓఓ అనురాధ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యతరగతి మహిళల్లో నైపుణ్యాలను పెంపొందిస్తే వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

అభినందనలు



గచ్చిబౌలి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ దవాఖానాల అభివృద్ధి చేపట్టాలని ఆయన కోరారు.

వేమనకు ఘన నివాళి

రాయదుర్గం: వేమన జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నానక్‌రాంగూడలో స్థానిక రెడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమన శతకాలను గుర్తు చేసుకున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ముత్యంరెడ్డి, కృష్ణారెడ్డి, సదారెడ్డి, రాజురెడ్డి, శోభన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరీష్‌రెడ్డితోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రెడ్డి అసోసియేషన్ ప్రతినిధులు

చిత్ర ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం చిత్ర ప్రదర్శన ప్రారంభమైంది. ఆర్ట్ వర్క్‌లు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను జేఎన్‌ఏ ఎఫ్‌ఏయూ హైదరాబాద్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. కవిత ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎంబ్రాయిడరీ ఆర్ట్ వర్క్ ఎగ్జిబిషన్‌లో 37 వర్క్‌లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.అలాగే చిత్రకారుడు అరవింద్ మహర్‌కర్ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. 52 పెయింటింగ్‌లు, 25 స్కల్ప్చర్స్ అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం.వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పాఠ్యాంశాలలో ఎస్‌డీజీ థీమ్‌లను చేర్చాలి

- విశ్వవిద్యాలయాలు సమాజానికి మరింత చేరువ కావాలి
- సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొ.శ్రీరామ్ రామకృష్ణ


సదస్సులో ప్రొ.రామకృష్ణ, వీసీ బీజేరావు తదితరులు

రాయదుర్గం: పాఠ్యాంశాలలో యూఎన్‌ఓ 'సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అనే అంశాన్ని చేర్చాల్సిన అవసరం ఉందని సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ఎవరెస్ట్ చైర్ ప్రొఫెసర్ శ్రీరామ్ రామకృష్ణ ప్రభుత్వాలను కోరారు. విద్యార్థులలో మరింత అవగాహన, పరిశోధన ఆలోచనలను పెంపొందించడానికి పాఠ్యాంశాలలో చేరిస్తే వీటికి ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని సావిత్రిబాయి పూలే ఆడిటోరియంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ సదస్సును హెచ్‌సీయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ స్థాయిలలో విద్యలో ఎస్‌డీజీని చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు సమాజానికి మరింత చేరువ కావాలని, విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రచారం చేయాలని, తద్వారా ఎక్కువ మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ ఎస్‌డీజీ థీమ్ ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపినగర్‌లో ఉర్సు ఉత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్ ఖ్వాజ గరీబ్ నవాజ్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి జరిగాయి. ఈ వేడుకల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, బీఆర్‌ఎస్ బస్తీ కమిటీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, షేక్ రజాక్, రియాజ్, మహమ్మద్, దస్తగిరి, పర్వీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో 6,7 తేదీలలో జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డైనమిక్స్' అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ సయ్యద్ నజియుల్లా తెలిపారు. ఫిబ్రవరి 6,7వ తేదీలలో సదస్సును నిర్వహిస్తామన్నారు. విక్షిత్ భారత్ మార్గంలో భవిష్యత్ సవాళ్ళను కూడా పరిశీలిస్తుందన్నారు. ఈ సదస్సులో పత్ర సమర్పణకు ఈనెల 21వ తేదీ చివరితేదీ పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం డాక్టర్ అహ్మద్ రజా ఫోన్ నెంబర్ 9873770067లో సంప్రదించాలని ఆయన సూచించారు.

డ్రంకన్ డ్రైవ్.. జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిందని పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు .పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి నలుగురికి రూ. 10 వేలు చొప్పున జరిమానా, మిగతావారికి పదివేల జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంస్కృతి స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

గచ్చిబౌలి: సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్-2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా పోటీలను పాఠశాల చైర్మన్ లక్ష్మణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల పట్ల కూడా విద్యార్థులలో ఆసక్తిని కలిగించేలా చేయడం కోసమే ఈ పోటీలను ప్రతి యేటా నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలలో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, చెస్, క్యారమ్, హైజంప్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయదుర్గం: అయోధ్య ఆలయంలో రాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు శ్రీరాముని శోభాయాత్ర, 10 గంటలకు ప్రత్యేక భజనలు, 10.30కు శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు, 11 గంటలనుంచి ప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యక్ష ప్రసార వీక్షణ కార్యక్రమం, 11.30 గంటలకు స్వామివారికి ప్రత్యేక అర్చన, శ్రీరామ నామ సంకీర్తన. అలాగే 12.20 నుంచి 12.30 గంటల మధ్య ప్రాణ ప్రతిష్ఠ సమయానికి ప్రత్యేక మంగళ హారతి ఇస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణమంతటా దీపాలు వెలిగించి దీపోత్సవంను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

24న 'మనూ'లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు

రాయదుర్గం: మనూలో ఈనెల 24, 25 తేదీలలో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ (టీహెచ్‌సీ ఏడవ వార్షిక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. టీహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రాధికా శేషన్, ప్రొఫెసర్ దానిష్ మోయిన్ ప్రసంగిస్తారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన పరిశోధనా రచనలను ప్రోత్సహించే లక్ష్యంతో 2007లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆసక్తి గల అభ్యర్థులు కాన్ఫరెన్స్‌లో పాల్గొని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. మరింత సమాచారం కోసం డాక్టర్ ఇక్రాముల్ హక్ ఫోన్ నెంబర్ 8800269320లో సంప్రదించవచ్చు.

హెచ్‌ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఏర్పాటు చేసిన సూత్ర ఎగ్జిబిషన్‌ను నిర్వాహకుడు ఉమేష్ మాధ్యన్, మోడల్స్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని, మూడురోజుల పాటు ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు.

హైటెక్స్‌లో ఏస్ టెక్ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం

మాదాపూర్: అల్యూమినియం డోర్స్, విండోస్ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ఏస్ టెక్ ట్రేడ్ ఫెయిర్‌ను.. ఎన్‌కోర్ ఆల్కమ్ ఫౌండర్ సీఎండీ శివకోటి రెడ్డి ప్రారంభించారు. 1.8 టన్నుల బరువు గల 18 అడుగుల ఎత్తైన విండోను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్కిటెక్‌లు శ్రీకాంత్‌రెడ్డి, రఘురాం, ఆల్కమ్ డైరెక్టర్ జయరాం భాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు అవుతు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీహర్ష పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త డంప్ చేస్తే కఠిన చర్యలు

- జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: చట్ట వ్యతిరేకంగా ఎవరైనా డంపింగ్ చేస్తే వాళ్ళపై కేసులు నమోదు చేయాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే జరిమానాలు వేయాలని సూచించారు. రోడ్ల పక్కన చెత్త, ఇతర వ్యర్థాలు డంపింగ్ చేసే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, మాదాపూర్, మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీలు, ఏఎంఓహెచ్‌లు, రాంకీ ఏజెన్సీ, ట్రాక్టర్స్ అసోసియేషన్, బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

- హెచ్‌సీయూ ఏఐఓబీసీఎస్‌ఏ సదస్సులో వక్తలు

రాయదుర్గం: కులగణనతో ఎన్నో సమస్యలకు చెక్ పెట్టవచ్చని, అలాగే సామాజిక న్యాయానికి దారితీస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కులగణనపై జాతీయస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ జూడో అభియాన్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ద్రవిడ కజగం అధ్యక్షుడు డాక్టర్ వీరమణి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వెంకటేష్, అసోసియేషన్ జాతీయ సలహాదారు డాక్టర్ హరి ఇప్పనపల్లి, జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్, కార్యదర్శి కరుణానిధి, జాతీయ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ, ఆర్‌జేడీ మీడియా జాతీయ ప్రతినిధి ప్రియాంక భారతి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన కేవలం రిజర్వేషన్లు పెంచడానికి కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు, సాంఘిక, ఆర్థిక, విద్యాపరంగా కులాల్లో ఉన్న వ్యత్యాసాలను రూపుమాపడానికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సర్వే ఆధారంగా రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్‌ఏ నాయకులు సాయికిరణ్, కొండల్, శివయాదవ్, మురళీయాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.